క్లుప్తంగా

కల్యాణం..కమనీయం



మంగళగిరి: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నగరంలోని ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. నవులూరు గోలివారితోట, కాజ అగస్త్యేశ్వర స్వామి ఆలయం, యర్రబాలెం శివాలయం పాత మంగళగిరి కనకదుర్గ ఆలయాల్లో కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యి.. తిలకించారు. స్వామి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయాల వద్ద కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్మికులకు న్యాయం చేయండి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ గురువారం సందర్శించి, కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది కోట్ల రూపాయలు విలువ చేసే సిమెంట్ ఫ్యాక్టరీ భూములు ఉన్నా కార్మికులకు బకాయిలు మాత్రం యాజమాన్యం చెల్లించకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా మంత్రి నారాలోకేష్ ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. యహోషువా, మాణిక్యరావు, బాష, అగ్గయ్య, దానయ్య, శివకుమారి, సారమ్మ, రిబ్కా పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులపై అధికారుల స్పందన

సాక్షి ఎఫెక్ట్

మంగళగిరి: సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన విద్యార్థులా.. లేక కూలీలా శీర్షిక కథనానికి అధికారులు స్పందించారు. విద్యాశాఖ మంత్రి నారా నియోజకవర్గంలో విద్యార్థులతో పనులు చేయించడంపై జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక, తెనాలి ఉప విద్యాశాఖాధికారి గురువారం ప్రధానోపాధ్యాయులు ద్వారా నివేదిక తెప్పించుకున్నారు. నివేదిక ప్రకారం పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గదుల్లో కుర్చీలు సిబ్బంది ద్వారా సర్దించడం జరిగిందని, వారికి సహాయంగా కొందరు విద్యార్థులు కుర్చీలు, బెంచీలు పట్టడం జరిగిందన్నారు.

మహాశివరాత్రి భారీ అన్నదానం



తాడేపల్లిరూరల్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తాడేపల్లి సీతానగరం సోమేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు విచ్చేసి, ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహా శివరాత్రి సందర్భంగా అన్నదానం నిర్వహిస్తున్న అంబటి తిరుపతిరావు, అంబటి వెంకటేశ్వరరావు, అంబటి రఘురాముడును అభినందించారు. సుమారు వెయ్యి మంది భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారని పేర్కొన్నారు.

కష్టించి పనిచేస్తే సముచిత స్థానం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

ఫిరంగిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టించి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. మండలంలోని పొనుగుపాడు, గుండాలపాడు గ్రామాల్లో గురువారం సాయంత్రం నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి గ్రామంలో పేదలకు ప్రభుత్వం పథకాలు అందేవన్నారు. నేడు కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. అనంతరం గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేఖమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా, చిట్టా అంజిరెడ్డి, కొమ్మారెడ్డి చిన్నపురెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, గేరా కోటేశ్వరరావు, మేలం జోజిబాబు, సర్పంచ్ పి.మధుసూదనరావు, పెరికల చిన్నా, చేవూరి రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు
- పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలించిన గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ భానూదయ

ప్రత్తిపాడు: కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 256, 257 పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం ఎనిమిది గంటల నుంచి కేంద్రాలకు తరలివచ్చారు. సాయంత్రం నాలుగు గంటల వరకు ఎన్నికల అధికారులు పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు.

- ప్రత్తిపాడు తహసీల్దార్ జి. కరుణకుమార్ పోలింగ్ ప్రక్రియను పరిశీలించగా, ఎంపీడీవో కె. శివపార్వతి పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ భానూదయ ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు మండలాల్లోని పోలింగ్ స్టేషన్లను, బందోబస్తును సీఐ జి. శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు.
- కొందరు పట్టభద్రులలు పిల్లాపాపలతో కలిసి వచ్చి ఓటు హక్కు వినియోగించుకోగా, కొందరు నిండు గర్భవతులు కూడా మండే ఎండలో నడుచుకుంటూ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు.
- ప్రత్తిపాడు ఎస్ఐ కె. నాగేంద్ర ఓటర్ల గుర్తింపు కార్డులు పరిశీలించి స్కూల్ ఆవరణలోకి ఓటర్లను అనుమతించారు.
- అటు కూటమి అభ్యర్థులు, ఇటు పీడీఎఫ్ బలపరిచిన అభ్యర్థి వర్గీయులు విడివిడిగా శిబిరాలు ఏర్పాటుచేసుకుని ఓటర్లుకు ఓట్లు, పోలింగ్ బూత్‌ల వివరాలు అందించారు.
- స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఐదు మండలాల్లో పర్యటించారు. కూటమి శిబిరాల వద్ద ఓటర్లకు స్లిప్పులు అందించారు. కేంద్రాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు.

కాకుమానులో..

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను డీఎస్పీ భానూదయ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 1076 ఓట్లు ఉన్నాయని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ బి.వెంకటస్వామి, సీఐ జి.శ్రీనివాసరావు, ఎస్ఐ ఏక్‌నాథ్, సిబ్బంది ఉన్నారు.

పొన్నూరులో..

ఎమ్మెల్సీ ఎన్నికలు పొన్నూరులో గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. పొన్నూరు పట్టణం నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్‌లో ఐదు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఓటింగ్ ప్రక్రియను ఏఈఆర్‌ఓలు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు పర్యవేక్షించారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఏఆర్ డీఎస్పీ, అర్బన్ సీఐ రవికిరణ్, ఎస్ఐ శ్రీహరి బందోబస్తు నిర్వహించారు. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 12 గంటలకు పుంజుకుంది. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పొన్నూరులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ పరిస్థితి, ఓటింగ్ పరిశీలన, పోలీసు బందోబస్తును ట్రైనీ ఐపీఎస్ అధికారి దీక్షిత పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

టీడీపీ నేతలను అడ్డుకున్న పోలీసులు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో సెల్‌ఫోన్ అనుమతిని పోలీసులు నిరాకరించారు. పాఠశాల ప్రధాన ద్వారం వద్ద సెల్‌ఫోన్‌లతో లోపలికి వెళుతున్న కొంతమంది కూటమి నేతలను పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, నేతల మధ్య వాదనలు చోటుచేసుకున్నాయి.



పొన్నూరు పట్టణంలోని పోలింగ్ కేంద్రంలో ఓటర్లు



పెదకాకానిలో ఓటు వేసేందుకు వచ్చిన వికలాంగులు, బాలింత

నియోజకవర్గంలో పోలైన ఓట్ల వివరాలు..

మండలం	పీఎస్ నం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
ప్రత్తిపాడు	256	703	503	71.55
ప్రత్తిపాడు	257	617	441	71.47
పెదనందిపాడు	258	831	562	67.63
పెదనందిపాడు	259	772	508	65.80
కాకుమాను	260	1,076	736	68.40
వట్టిచెరుకూరు	267	572	390	68.18
వట్టిచెరుకూరు	268	574	348	60.63
గుంటూరు వెస్ట్	252	1,164	615	52.84
గుంటూరు వెస్ట్	253	1,155	603	52.21
గుంటూరు ఈస్ట్	254	1,579	910	57.63
గుంటూరు ఈస్ట్	255	1,251	754	60.27
మొత్తం	--	10,294	6,370	61.88



పెదకాకాని హైస్కూలులో ఓటు వేసేందుకు బారులుతీరిన పట్టభద్రులు

పోలింగ్ సరళి ఇలా...

పొన్నూరు పట్టణ, మండల పరిధికి సంబంధించి 5 పోలింగ్ కేంద్రాలలో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. 261 బూత్‌లో 1019 ఓటర్లు ఉండగా, 782 ఓట్లు పోలయ్యాయి. 262 బూత్‌లో 600 ఓట్లకు గానూ 428, 262–ఏ బూత్‌లో 571 ఓట్లకు గానూ 401, 263 బూత్‌లో 908 ఓట్లకు గానూ 685 ఓట్లు పోలయ్యాయి. 264 పోలింగ్ బూత్‌లో 527 ఓట్లకు గానూ 336 పోలయ్యాయి. పట్టణ, మండల పరిధిలో మొత్తం 3625 ఓట్లు ఉండగా 2632 పోలయ్యాయని, 72.61 శాతం నమోదయినట్లు తహసీల్దార్ జియావుల్‌హక్ తెలిపారు.

పెదకాకానిలో..

పెదకాకాని: ఎమ్మెల్సీ ఎన్నికలు పెదకాకానిలో ప్రశాంతంగా ముగిశాయి. జెడ్పీహెచ్ పాఠశాలలో 269, 270, 271, 271ఎ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరిగింది. మొత్తం 2534 ఓట్లకు గానూ 1831 పోలయ్యాయి. పోలింగ్ శాతం 72.2 గా నమోదైంది. అడిషనల్ ఎస్పీ రవికుమార్ పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ఏర్పాట్లను తహసీల్దార్ పి. కృష్ణకాంత్, ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కెల్లంపల్లి శ్రీనివాసరావు, సీఐ టి.పెదనారాయణ స్వామి పరిశీలించారు.

- పెదకాకాని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. వికలాంగులు, వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

చేబ్రోలులో..

మండల పరిధిలోని 13 గ్రామాల పరిధిలో మొత్తం 1887 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 265లో 876మంది ఓటర్లు, 266లో 1011మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఎస్ఐ డి. వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దారు కె. శ్రీనివాసశర్మ పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. వికలాంగ ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీల్ చైర్‌ను ఏర్పాటు చేశారు. 265 నంబరు పోలింగ్ కేంద్రంలో 584 మంది, 266 నంబరు పోలింగ్ కేంద్రంలో 700మంది ఓటు వేశారు. రెండు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1284మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ట్రైనీ ఐపీఎస్ దీక్ష పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.



కాకుమానులో ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న డీఎస్పీ భానూదయ



చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బారులుతీరిన ఓటర్లు



ప్రత్తిపాడులోని పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలైన్లలో పట్టభద్రులు



పిల్లలతో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న యనమదలకు చెందిన భార్యాభర్తలు

ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గుంటూరు రూరల్: మండలంలోని అడవితక్కెళ్లపాడులో గల అంబేడ్కర్ రెసిడెన్షియల్ బాలుర వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్(సత్తెనపల్లి) ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ నిర్వహించారు. కార్యక్రమాన్ని మోన్‌టెక్స్ పెన్స్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ సేల్స్ మేనేజర్ యూకే రాజు, సేల్స్ ఎగ్జిక్యూటివ్ విజయ్‌భాస్కర్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా కుగ్లర్ మెమోరియల్ ఫిజియోథెరపీ కాలేజీ (గుంటూరు) కస్పాండెంట్ కర్ర హనోక్ బెంజిమెన్ మాట్లాడుతూ విజయాలను సాధించిన ప్రతి ఒక్కరు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్లే సాధ్యమైందని తెలిపారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి మార్కులు సాధించాలని చెప్పారు. క్రమశిక్షణ, మంచి ఆలోచన విధానంతో ఇంటర్మీడియట్ దశను దాటిన వారే జీవితంలో మంచి భవిష్యత్తును అందుకోగలరని సూచించారు. స్కాలర్స్ ఆర్ ఆర్ బీ కోచింగ్ డైరెక్టర్ టి. ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని, వ్యక్తిని సమర్థ ప్రగతిశీల వనరుగా తీర్చిదిద్దేది కేవలం చదువు మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కొండారెడ్డి, ఐబీటీ నీట్ అకాడమీ డైరెక్టర్ ఆనంద్‌బాబు, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, శ్రీలక్ష్మి, ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు నాగభూషణం విశ్వేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి



గుంటూరు రూరల్: మండలంలోని తోకవారిపాలెంలో బుధవారం అనుమానాస్పదస్థితిలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోపూరి శ్రీనివాసరావు మృతి చెందిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ గురువారం శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్ని విధాలా వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో గుంటూరు రూరల్ మండలం, తోకవారిపాలెం గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంభో శివ శంభో

- మహాశివునికి అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో అన్నాభిషేకం
- నవ దంపతుల గ్రామోత్సవం

ప్రత్తిపాడు: స్థానిక శ్రీగంగా పార్వతీసమేత దండేశ్వరాలయంలో హరోంహర హరహర మహాదేవ అంటూ శివనామస్మరణ మిన్నంటింది. మహా శివరాత్రి పర్వదినాన ఆది దంపతులు అగ్ని సాక్షిగా ఒక్కటయ్యారు. అశేష భక్త జన సందోహం నడుమ పార్వతీపరమేశ్వరుల పరిణయ వేడుక వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ బుధవారం రాత్రి వైభవోపేతంగా జరిగింది. గురువారం ఉదయం నూతన వధూవరులు గ్రామోత్సవంగా గ్రామంలోకి తరలి వచ్చారు. మేళతాళాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై పురవీధుల్లోనికి వచ్చిన ఉత్సమూర్తులకు మహిళలు వారులు పోసి హారతులిచ్చారు. అర్చకులు పరమేశ్వరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

లింగోద్భవ కాలంలో అన్నాభిషేకం

బుధవారం అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో లింగోద్భవకాలంలో కైలాసనాథునికి అంగరంగ వైభవంగా అన్నాభిషేకం జరిగింది. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు వందల సంఖ్యలో ప్రజలు శివాలయానికి వచ్చారు. రాత్రంతా శివాలయ ప్రాంగణంలోనే జాగారం చేస్తూ శివస్తుతి చేశారు.



దండేశ్వరాలయంలో అన్నాభిషేకం

అభియోగాలు లేకుండా పదవీ విరమణ అదృష్టం

సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

లక్ష్మీపురం: ప్రభుత్వ ఉద్యోగులు తప్పులు, అభియోగాలు లేకుండా ఉద్యోగ విరమణ చేయడం అదృష్టంగా భావించాలని సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. కన్నవారితోటలోని జీఎస్‌టీ భవన్‌లో సూపరింటెండెంట్ పోగుల ఆషా ఉద్యోగ విరమణ సభ గురువారం నిర్వహించారు. కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో తెలిసో తెలియక చేసిన తప్పులు వల్ల పలు శాఖల్లోని ఉద్యోగులు విజిలెన్స్ కేసులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అవి పరిష్కారం అయ్యేసరికి పదవీ కాలం కూడా ముగుస్తుందన్నారు. కొన్ని కేసులు రిటైర్మెంట్ తర్వాత కూడా వేధిస్తాయని, పెన్షన్ లో కూడా ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు. ఉద్యోగులందరూ విధినిర్వహణలో ఎలాంటి అభియోగాలు, అభ్యంతరాలు, ఆరోపణలు, లోపాలు లేకుండా పనిచేయాలని సూచించారు. పదవీ విరమణ చేస్తున్న ఆషా తన సర్వీసులో ఎటువంటి మచ్చ లేకుండా, పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేశారని కమిషనర్ కొనియాడారు. అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆషా ఎన్నోసార్లు రక్తదానం చేశారని, అవయవ దానం చేయడానికి కూడా ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం ఆషా, నాగశంకర్ దంపతులను కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఆయన సతీమణి, కేంద్ర ప్రభుత్వ శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు సాధు కావ్య, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్లు వి.వి.రావు, నాగరాజు, రవికుమార్, మనోజ్ కుమార్, రాయలు, సీతారామరాజు సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, చీదెళ్ల ఈశ్వరరావు, చిట్టి వెంకట్, పెన్షనర్ల సంఘ నాయకులు రాజేశ్వరరావు, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.వి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, సామ్రాజ్యం పాల్గొన్నారు.



ఆషా, నాగశంకర్ దంపతులను సత్కరిస్తున్న నరసింహారెడ్డి తదితరులు

సూపర్ సిక్స్‌ను పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వం

- పోసాని మురళీకృష్ణ అరెస్ట్ అక్రమం
- వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



తాడేపల్లి రూరల్: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వంలోని పార్టీలన్నీ ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చాయని, సూపర్ సిక్స్‌ను అమలు చేస్తామని చెప్పి గద్దెనెక్కిన తర్వాత విస్మరించాయని వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. గురువారం రాత్రి తాడేపల్లిలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హామీలను మరచి, ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నాయకులను కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేసి, భయభ్రాంతులకు గురిచేస్తోందని మండిపడ్డారు. విలేకరులతో మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు 40 ఏళ్ల అనుభవం ఉందని పదేపదే మాట్లాడారని, ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఎన్నికల అనంతరం వాటిని తుంగలో తొక్కారన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులకు టార్గెట్ చేసి రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది నెలల కాలంలో వేలాది మందిపై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. దానిలో భాగంగా సినీ నటుడు పోసాని కృష్ణమురళీపై అక్రమ కేసు బనాయించి, హైదరాబాద్ నుంచి రాత్రికి రాత్రి రాయలసీమ తరలించారన్నారు. పోసాని రచయిత, అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి అని, అతను ఎక్కడా కూటమి ప్రభుత్వాన్ని దూషించలేదన్నారు. ప్రభుత్వం చేస్తున్న పరిపాలనపై మాట్లాడారని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చెప్పిన విధంగా ఆయా ప్రాంతాల్లో అధికారులు నడుచుకుంటున్నారని, ఏది మంచి ఏది చెడు అని కూడా ఆలోచించకుండా అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు 30 వేల మంది ఆడపడుచులు కనిపించడం లేదంటూ పదేపదే ఆరోపణలు చేశారని, ఆ 30 వేల మందిలో ఎంతమందిని తీసుకువచ్చారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం వారిపై ఉందని డిమాండ్ చేశారు. గుడ్లవల్లేరు కాలేజీ వంటి ఘటనలు అనేక చోట్ల జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు. ప్రజలు ప్రభుత్వ తీరును పరిశీలిస్తున్నారని, ఏదో రోజు ప్రజలు ప్రభుత్వంపై తిరగబడతారని ఆయన అన్నారు.

ప్రభుత్వం తక్షణమే జాబ్ కేలండర్ ప్రకటించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వశాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కృష్ణా–గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుమ్మా శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొన్నూరు రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ప్రకటించి, ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పారదర్శకత చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేసి, నిరుద్యోగుల ఆశలు వమ్ము కానీయకుండా చర్యలు చేపట్టాలని కోరారు. నిరుద్యోగుల జీవితాలను బాగు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం పని చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టమైన ఆలోచన, ప్రణాళికతో 11 అంశాలను మేనిఫెస్టోలో చేర్చానని చెప్పారు. గురువారం జరిగిన ఎన్నికల్లో తనకు ఓటు వేసిన గ్రాడ్యుయేట్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్ యాదవ్

నేడు భారీ అన్న సంతర్పణ

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి పోలకంపాడులో వేంచేసియున్న పోలకమ్మ తల్లి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు వంగ దేవ గురువారం తెలిపారు. పోలకంపాడులోని పోలకమ్మ తల్లిదేవాలయ 17వ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం నుంచి 11 గంటల వరకు అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో అనంత ప్రభాకర్, తోక సత్యనారాయణ, గంగాధర్, కొండలరావు, బత్తుల నాగబాబు, బత్తుల ప్రభుదాసు, వంగ నరేంద్ర పాల్గొన్నారు.

